
# అటకెక్కిన తయారీ

## ఫిబ్రవరిలో ఉత్పాదక రంగం కుదేలు
## 14 నెలల కనిష్ఠానికి పీఎంఐ సూచీ
## గత నెలలో 56.3గానే నమోదు • 2023 డిసెంబర్ తర్వాత ఇదే తొలిసారి



న్యూఢిల్లీ, మార్చి 3: దేశంలో తయారీ రంగ వృద్ధిరేటు గత నెల 14 నెలల కనిష్ఠాన్ని తాకింది. ఫిబ్రవరిలో 56.3గానే నమోదైంది. అంతకుముందు నెల జనవరిలో ఇది 57.7గా ఉండగా.. నెల రోజుల్లోనే 1.4 మేర దిగజారి పోవడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్, నవంబర్ నెలల్లోనూ 56.4, 56.5గా ఉన్నది. ఈ క్రమంలోనే 2023 డిసెంబర్ తర్వాత తొలిసారి ఏడాదికిపైగా కనిష్ఠ స్థాయికి పడిపోయినట్టైంది. సోమవారం హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) సర్వే వచ్చింది. కొత్త ఆర్డర్లు అంతంతమాత్రంగానే ఉండటం, ఇందుకు తగ్గట్టుగా ఉత్పత్తీ మందగించిపోవడం.. పీఎంఐ సూచీని మరింత తగ్గేలా చేసిందని హెచ్ఎస్‌బీసీ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు.




### ఎగుమతులు పెరిగినా..

గత నెల ఎగుమతులకు సంబంధించి ఆర్డర్లు పెరిగినా.. అవి దేశంలో ఆర్థిక కార్యకలాపాలు, తయారీ రంగాన్ని ఉత్సాహపర్చలేకపోయాయని తాజా గణాంకాలనుబట్టి తెలుస్తున్నది. ముఖ్యంగా మార్కెట్‌లో అమ్మకాలు పడిపోవడం.. ఉత్పాదకతను దెబ్బతీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌ను దేశీయ తయారీ రంగ సంస్థలు అందిపుచ్చుకోలేకపోతున్నాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయితే ఉత్పాదక సామర్థ్యం పెంపు, నాణ్యత వంటి వాటిపై దృష్టిపెట్టి.. వాటికనుగుణంగా పెట్టుబడులను సమకూర్చుకుంటే ఈ పరిస్థితి నుంచి బయటపడవచ్చన్న సూచనలు నిపుణుల నుంచి వస్తున్నాయి.

### ద్రవ్యోల్బణం సెగ

ద్రవ్యోల్బణం పెరగడం కూడా ఉత్పత్తి, అమ్మకాలను ప్రభావితం చేస్తున్నది. వస్తు, సేవల ధరలు అధికంగా ఉంటే కొనుగోలుదారులు సహజంగానే వెనకడుగు వేస్తారని, కాబట్టి ధరలు అదుపులో ఉన్నప్పుడే వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుతుందని మార్కెట్ నిపుణులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం అటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణం, ఇటు రిటైల్ ద్రవ్యోల్బణం రెండూ కూడా విజృంభిస్తున్నాయి. ఫలితంగా ఆహార, ఆహారేతర వస్తూత్పత్తుల ధరలు తారెత్తిస్తున్నాయి. దీంతో అమ్మకాలు క్షీణించి, ఉత్పాదకత కూడా దిగాలుపడుతున్నది.

### అప్పుడే.. జీడీపీ వృద్ధి

భారత జీడీపీలో ఒక్క తయారీ రంగం వాటానే 17 శాతం వరకు ఉంటుంది. కాబట్టి తయారీ రంగం పరుగులు పెడితే.. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఉరకలెత్తుతుంది. అయితే ప్రభుత్వాల నుంచి అరకొర సాయం, పెరిగే విదేశీ దిగుమతులు, పెట్టుబడుల కొరత, నైపుణ్య-సాంకేతిక లేమి, రుణ లభ్యత అంతంతే ఉండటం వంటివి.. తయారీ రంగాన్ని కుదేలు చేస్తున్నాయన్న ఆందోళనలు కనిపిస్తున్నాయి. నిజానికి దేశ ఉద్యోగావకాశాల్లోనూ ఉత్పాదక రంగం పనితీరు స్పష్టంగా కనిపిస్తుంది. కనుక తయారీ రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, అప్పుడే దేశ ఆర్థిక వృద్ధికి పెట్టుకున్న లక్ష్యాలు నెరవేరగలవని అంతా అంటున్నారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బస్సెక్కి ఎక్కి కుటుంబసభ్యులకు వీడ్కోలు పలుకుతున్న బాబు

# అవ్వా.. ఇల్లు పైలం!

- ఉపాధి కోసం కష్టంగా ఉన్నా.. గల్ఫ్ బాటపట్టిన యువకుడు
- ఇక్కడ ఉద్యోగం దొరికే పరిస్థితి లేదని మనోవేదన
- నోటిఫికేషన్లు రావు.. ప్రైవేట్ జీతాలు సాలవు
- ఎవుసం చేద్దామంటే పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు
- అప్పు తీసుకొచ్చి సాగుచేస్తే నీళ్లు లేక కళ్లెదుట ఎండుతున్న పంటలు
- కన్నీళ్లు పెట్టుకుంటూ కుటుంబసభ్యులకు బాబు వీడ్కోలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 3: ఏ వలసల నివారణకు కాంగ్రెస్‌తో తలపడి తెలంగాణను తెచ్చుకున్నమో.. అదే తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పుణ్యమా అని ఇప్పుడు మళ్లీ పరాయి దేశాలకు పొట్టచేతబట్టుకుంటూ యువకుల వలసబాటలు పడుతున్నాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎవుసం పండుగలా మారి.. అన్ని రంగాలూ కళకళలాడి.. నాలుగు పైసలు సంపాదించుకొనే పరిస్థితి ఉంటే.. నేడు ఎక్కడా ఉపాధి లేక యువత మళ్లీ దిక్కులు చూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి 'చెయ్యి'చ్చిన పార్టీ పాలనలో నిరుద్యోగుల్లో ఆశలు సన్నగిల్లాయి. కనీసం పంటలు పండిద్దామన్నా కృత్రిమ కరువు తరుముకొచ్చింది. ఎమ్మెస్సీ, బీఈడీ చేసి.. అటు ఉద్యోగం రాక.. ఇటు ఎవుసం చేసే దారిలేక సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ యువకుడు భవిష్యత్తుపై భరోసా కరువై కన్నీళ్లు పెట్టుకుంటూ గల్ఫ్ బాట పట్టడం నేటి ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నది.

### ఉద్యోగాలు రాక.. ఎవుసంపై భరోసా లేక..

'తెలంగాణ వచ్చినంక ఏ పనిజేసినా ఈడనే బతుకుతమనే ధైర్యముండె.. ఇప్పుడు చేద్దామంటే ఎవుసానికి భరోసాలేదు.. పంటకు సాగునీళ్లు వస్తలేవు.. చదువుకున్నా ఉద్యోగ నోటిఫికేషన్లు రావు.. ప్రైవేట్‌లో జీతాలు సాలవు.. వచ్చే నాలుగేండ్లు ఏంజేసినా లాభంలేదనిపిస్తుందే అవ్వా.. బయటకు పోతున్నా ఇల్లు పైలం.. చెల్లే.. పోయస్తనే' అంటూ ఓ యువకుడు గల్ఫ్ బాటపట్టాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన మల్యాల బాబు ఉన్న ఊరును, కన్న తల్లిని, కట్టుకున్న భార్యను, కన్న కొడుకును వదిలి కన్నీళ్లు పెట్టుకుంటూ ఉపాధి కోసం సోమవారం దుబాయ్‌కి పయనమయ్యాడు. ఎమ్మెస్సీ, బీఈడీ చదివిన బాబు పొలం పనులతో పాటు ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. చిన్నతనంలో తండ్రి బాలయ్య గల్ఫ్ వెళ్లి 20 ఏండ్లు గడిపాడు. 14 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి ఇంటి వద్దే ఉండిపోయాడు. బాబు గతంలో రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం వేసిన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో దరఖాస్తు చేసి కొద్దిలో జాబ్ మిస్ అయ్యాడు. ఏడాదిలో పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. ఇటీవల రూ.2.5 లక్షలు పెట్టుబడి పెట్టి మూడెకరాలు పత్తి వేస్తే రూ.లక్ష వరకు పెట్టుబడి మీదపడ్డది. వరి వేద్దామనుకుంటే బావిలో నీళ్లు అడుగంటిపోయాయి. ప్రైవేట్ పాఠశాలలో చాలీచాలని జీతాలు.. కండ్లముందు చెల్లి పెండ్లి.. ఇతర అవసరాల కోసం చేసిన అప్పు తీర్చే మార్గం కనిపించడం లేదని చలించిపోయాడు. బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పడితేనే వీటన్నింటికీ పరిష్కారం ఉంటుందని వాపోయాడు. 'ఇక పోయస్తా' అంటూ గుండె నిండా బాధతో సోమవారం దుబాయ్ బయలుదేరాడు. 'అవ్వా ఇల్లు పైలం.. అంటూ తల్లి లక్ష్మికి, చెల్లే.. జాగ్రత్త అంటూ సోదరి రేఖకు, ఇంటిపై ఓ కన్నుంచు.. అంటూ బావకు, ఏడాది కొడుకు మహాన్‌ను ఎత్తుకుని.. 'నాన్నా టాటా' అంటూ బస్సెక్కాడు. కొనితెచ్చుకున్న నవ్వుకు ప్రయత్నించినా అతడిలో కంటతడి కనిపిస్తూనే ఉన్నది. బస్సెక్కి అందరికీ కంటతడిపెట్టి వీడ్కోలు పలికిన తీరు కుటుంబ సభ్యుల్లో ఒకింత బాధను నింపింది.

## రాజస్థాన్‌లో సింగేణి విద్యుత్తు ప్లాంట్లు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. రాజస్తాన్‌లో 3,100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయబోతున్నది. ఇందుకు సంబంధించి రాజస్థాన్ ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో రాజస్థాన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అలోక్ గుప్తా, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం నాయక్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీనిలో భాగంగా రాజస్థాన్ విద్యుత్తుశాఖ అనుబంధ సంస్థతో సింగరేణి జాయింట్ వెంచర్ విధానం కంపెనీని ఏర్పాటు చేయనున్నారు. ఈ జాయింట్ వెంచర్ కంపెనీతో 1600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను నెలకొల్పుతారు. మొత్తం లాభాల్లో 74% సింగరేణి, 26% రాజస్థాన్ విద్యుత్తు ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌కు వాటాగా నిర్ణయించారు.

# సరుకు రవాణాలోనూ టాప్

## ఎగుమతుల్లో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ రికార్డు
## 2024లో 1.80 లక్షల మెట్రిక్ టన్నులు


హైదరాబాద్, మార్చి 3: సరుకు రవాణాలో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2024లో సంస్థ 1,80,914 మెట్రిక్ టన్నుల సరుకును ఇతర దేశాలకు సరఫరా చేసింది. ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో సరుకును రవాణా చేయడం ఇదే తొలిసారి. 2023లో సరుకు రవాణాతో పోలిస్తే ఇది 22 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో అంతర్జాతీయ కార్గో 36 శాతం వృద్ధితో 1,08,520 టన్నులు కాగా, దేశీయంగా 3 శాతం వృద్ధితో 72,385 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు వెల్లడించింది. ఎగుమతైన వాటిలో 72 శాతం ఫార్మా ఉత్పత్తులే కావడం విశేషం. గడిచిన ఏడాదికాలంలో ఇంజినీరింగ్ వస్తువులతోపాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల బలమైన వృద్ధిని సాధించాయి.

- దేశాల పరంగా చూస్తే యూఏఈ, యూరప్ దేశాలకు 51 శాతానికి పైగా ఎగుమతి అయ్యాయి.
- వీటితోపాటు అమెరికా, యూరప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, దక్షిణాసియా, ఆస్ట్రేలియా, చైనా దేశాలకు ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి.
- కార్గో మౌలిక సదుపాయలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్..ఈ అంతర్జాతీయ విమానాశ్రయ సామర్థ్యాన్ని విస్తరిస్తున్నది. సరుకురవాణా కోసం ప్రత్యేకంగా టర్మినల్‌ను అభివృద్ధి చేస్తున్నది.
- ఇక్కడి నుంచి 20 అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లకు సరుకు రవాణా అవుతున్నది.
- సరుకు రవాణా కోసం ఖతార్ ఎయిర్‌వేస్..విమానాల సంఖ్యను పెంచుకున్నది. హైదరాబాద్-దోహా రూట్‌లో వారానికి మూడు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది.






'హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి కార్గో కార్యకలాపాల్లో విశేషమైన వృద్ధి నమోదవుతున్నది. అంతర్జాతీయ, దేశీయ కార్గో నిర్వహణలో ఉన్నత ప్రమాణాలు పాటించడం వల్లనే ఇది సాధ్యమైంది. వరుసగా రెండో ఏడాది కూడా కార్గో ఎగుమతుల్లో రెండో అత్యున్నత విమానాశ్రయంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ దక్కింది.
- ప్రదీప్ పనికర్, హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈవో



## ఐఆర్‌సీటీసీ, ఐఆర్ఎఫ్‌సీలకు నవరత్న హోదా

న్యూఢిల్లీ, మార్చి 3: ప్రభుత్వరంగ సంస్థలైన ఐఆర్‌సీటీసీ, ఐఆర్ఎఫ్‌సీలకు నవరత్న హోదాను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో నవరత్న హోదా కలిగిన సంస్థల సంఖ్య 26కి చేరుకున్నాయి. ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులు, ఆదాయ-లాభాల ఆర్జన ఆధారంగా కేంద్రం నవరత్న హోదాను ఇస్తున్నది. దీంట్లోభాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఐఆర్‌సీటీసీ రూ.4,270 కోట్ల వార్షిక ఆదాయాన్ని, ఐఆర్ఎఫ్‌సీ రూ.26, 644 కోట్ల ఆదాయాన్ని గడించాయి. ఈ రెండు సంస్థలకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ శుభాకాంక్షలు తెలియచేశారు. నవరత్న హోదా కలిగిన పీఎస్‌యూలు పెట్టుబడులు, నిర్వహణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. కంపెనీ నికర విలువలో 15 శాతం లేదా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండదు.



నారాయణపేట జిల్లా కౌరంపల్లి శివారులో కొడంగల్ ఎత్తిపోతల సర్వే పనులను అడ్డుకుంటున్న రైతులు

# పేట-కొడంగల్ సర్వే అడ్డగింత

- అనుమతి లేకుండా ఎలా చేస్తారని రైతుల నిలదీత
- వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

నారాయణపేట రూరల్, మార్చి 3 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల సర్వే పోలీసు బలగాలను మోహరించి సర్వే చేపడుతున్నా రైతుల నుంచి ఆటంకాలు తప్పడం లేదు. సోమవారం నారాయణపేట జిల్లా సింగారం పంచాయతీ పరిధిలోని కౌరంపల్లి శివారులో ఆర్ఐ గోపాల్‌రావు, జూనియర్ అసిస్టెంట్ల బృందం ప్రాజెక్టు కోసం సర్వే చేపట్టగా.. సంబంధిత భూముల రైతులు వెళ్లి అడ్డుకున్నారు. కొడంగల్ లిఫ్ట్‌లో విలువైన భూములు కోల్పోతామని రైతులు హన్మంతు, మాలప్ప, చిన్నబాలప్ప, నర్సింహ, రాములు అధికారులను నిలదీశారు.అనుమతి లేకుండా ఎలా సర్వే చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగిపోయారు.

## పోలీసులపై కాంగ్రెస్ నాయకుల జులుం

- ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడంతో కానిస్టేబుళ్లపై దాడికి యత్నం

మహబూబ్‌నగర్, మార్చి 3 : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులపైన కాంగ్రెస్ నాయకులు జులుం చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని దొడ్డలోనిపల్లిలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. ఆదివారం మధ్యాహ్నం దొడ్డలోనిపల్లికి చెందిన బాలకొండయ్య ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుంటే టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఇసుక ట్రాక్టర్ తరలిస్తుండగా.. పట్టుకున్న ప్రదేశానికి టూటౌన్ పీఎస్ కానిస్టేబుళ్లు ఇద్దరు వివరాలు సేకరించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో బాలకొండయ్య, వెంకట్రాది అక్కడకు చేరుకొని ట్రాక్టర్‌ను పట్టుకోవడానికి వచ్చారా? అని కానిస్టేబుళ్లను ప్రశ్నించారు. ఎస్పీ, డీఎస్పీలే మేము వెళితే కూర్చోమంటారు.. మీరెంత.. అంటూ వారిని నానా దుర్భాషలాడారు. దీంతో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్ ఫిర్యాదు చేశాడు. విధి నిర్వహణలో విచారణకు వెళితే కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారని కానిస్టేబుల్ పేర్కొన్నారు.




ఖమ్మం నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన ఉద్యమకారులు

# తెలంగాణ ఉద్యమకారుల పోస్టుకార్డు ఉద్యమం

## కాంగ్రెస్ హామీలు అమలు చేయాలని డిమాండ్

ఖమ్మం, మార్చి 3 : ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం అమరవీరుల స్థూపం వద్ద సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. పోస్టుకార్డుపై సంతకాలు చేసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, రూ.25 వేల పెన్షన్, గృహ నిర్మాణం కోసం రూ.10 లక్షల నగదు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

### రిజిస్ట్రేషన్‌కు 10 వేలు డిమాండ్

వినాయక్‌నగర్, మార్చి 3: ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌ను ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నది. నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్-2గా సీ శ్రీరామరాజు పని చేస్తున్నారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రార్ ఆఫీస్‌కు రాగా, రిజిస్ట్రేషన్ కావాలంటే రూ.10 వేలు ఇవ్వాలని శ్రీరామరాజు స్పష్టంచేశారు. దీంతో సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడు సోమవారం రూ.10 వేలు ఇచ్చేందుకు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లి శ్రీరామరాజు సూచన మేరకు స్వీపర్ వెంకట్‌రావుకు అందజేశాడు.అక్కడే మాటు వే సిన ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వారిని పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్యాల పల్లి గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యాష్ లారీ, టిప్పర్ అసోసియేషన్ నాయకులు

# బూడిద లోడింగ్ ఎన్టీపీసీనే చేపట్టాలని ధర్నా

- లోడింగ్‌లో దళారులకు రూపాయలు 4600 ఇవ్వలేం
- యాష్ లారీ టిప్పర్ అసోసియేషన్ నిరసన

పెద్దపల్లి, మార్చి 3(నమస్తే తెలంగాణ): బూడిద లోడింగ్‌ను ఎన్టీపీసీనే చేపట్టాలని, ఒక్కో టిప్పర్‌కు రూ. 4600 వసూలు చేస్తున్న దళారుల నుంచి విముక్తి కల్పించాలని లారీ, టిప్పర్ల ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మల్యాలపల్లి గేట్ వద్ద యాష్ టిప్పర్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బూడిద లారీల రవాణాను నిలిపివేసి ఎన్టీపీసీకి వ్యతిరేకంగా నినదించారు. ప్రతి రోజూ దాదాపుగా వెయ్యి లారీల ద్వారా బూడిద రవాణా జరుగుతుంటే.. అందులో స్థానిక లారీలు కేవలం 120 వరకే ఉంటాయని చెప్పారు. నేషనల్ హైవేల నిర్మాణానికి బూడిదను తరలిస్తున్న లారీలకు ఒక్కో టన్నుకు ఎన్టీపీసీ రూ.1260 వరకూ చెల్లిస్తున్నదని తెలిపారు. ఒక్కో లారీకి రూ. 4600 నుంచి 9200 వరకు లోడింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని వాపోయారు. యాష్ పాండ్‌లో లోడింగ్ దళారుల నుంచి విముక్తి కల్పించి ఇకపై నేరుగా ఎన్టీపీసీనే లోడింగ్ చేపట్టాలన్నారు. తమ సమస్యను ఎన్టీపీసీ యాజమాన్యం పరిష్కరించే వరకూ రవాణాను నిలిపి వేస్తున్నామని ప్రకటించారు.

# గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- కొత్తగడిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చినఘటన
- ఫోన్ ద్వారా విద్యార్థినితో మాట్లాడిన స్పీకర్




వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి గురుకుల పాఠశాల

వికారాబాద్, మార్చి 3 : టీచర్ల వేధింపులు భరించలేక 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి యత్నించిన ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. కొత్తగడి గురుకుల పాఠశాలలో స్రవంతి టీచర్ తబిత అనే 10వ తరగతి విద్యార్థిని తరచూ వేధించసాగింది. దీంతో మనోవేదనకు గురైన తబిత ఫిబ్రవరి 24న పాఠశాల మొదటి అంతస్తు నుంచి దూకడంతో ఎడమ కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. పాఠశాల సిబ్బంది ప్రైవేటు వాహనంలో ప్రైవేటు దవాఖానకు తరలించి, తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. తబితకు కాలు విరగడంతో సిమెంట్‌పట్టి వేశారు. సోమవారం విద్యార్థినితో కలిసి తల్లిదండ్రులు వికారాబాద్ కొత్తగడి గురుకుల పాఠశాలకు వచ్చి టీచర్లను నిలదీశారు. విద్యార్థి సంఘాలు పాఠశాలకు చేరుకొని విద్యార్థినిని వేధించిన టీచర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమా ర్ తెలియడంతో ఆ విద్యార్థినిని పరామర్శించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్‌ను పంపించారు. అనంతరం విద్యార్థినితో స్పీకర్ ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలలో టీచర్లు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపింది. వెంటనే స్రవంతి మే డంను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరింది. దీంతో స్పీకర్ టీచర్లతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు.



కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

# గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములిచ్చేది లేదు

- ముద్విన్, మర్రిపల్లి, ఏక్వాయిపల్లి గ్రామసభలు

కడ్తాల్, మార్చి 3: రంగారెడ్డి జిల్లా కడ్గాల్ మండలంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములిచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. కడ్తాల్ మండలంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ఇదివరకే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి భూసేకరణ కోసం సోమవారం ముద్విన్, మర్రిపల్లి, ఏక్వాయిపల్లి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందజేస్తుందని వెల్లడించగా, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేది లేదని రైతులు తెగేసి చెప్పారు. ఏక్వాయిపల్లి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి ఉంటుందని, తొలుత ఆ రహదారిని అభివృద్ధి చేయాలని సూచించారు.

# విచారణ మార్పునకు 60 లక్షలకు డీల్ !

- అవినీతి అధికారిపై విచారణ నివేదిక మార్పునకు ప్రయత్నం
- ఓ రాజకీయ నాయకుడి సహకారంతోనే బేరసారాలు!

గద్వాల అర్బన్, మార్చి 3 : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఓ ఆలయ అధికారి అవినీతి వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు వెలువడగా ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారి అక్రమాలపై విచారణ చేపట్టినట్టు తెలిసింది. విచారణలో సదరు అధికారికి సంబంధించి కీలక విషయాలపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపేందుకు సిద్ధం చేసినట్టు సమాచారం. దీంతో అధికార పార్టీకి చెందిన ఓ రాజకీయ నాయకుడి సహకారంతో పత్రికల్లో వచ్చిన వార్తలు ఆరోపణలు అన్న విధంగా విచారణ నివేదిక మార్పులు చేసేందుకు రూ.60లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్టు తెలిసింది. విచారణ క్రమంలో విదేశాలకు చెందిన కొందరు భక్తులు సదరు అధికారిపై ఫిర్యాదులు చేసినట్టు కూడా తేలింది.



# ఇండ్ల స్థలాలు గుంజుకోవద్దని కలెక్టరేట్ ముట్టడి

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం శివాయిగూడెం కొత్త కాలనీ (పువ్వాడ ఉదయ్ నగర్)లో 900 మంది పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలు గుంజుకోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌ను ముట్టడించారు. స్థానిక ధర్నా చౌక్ నుంచి ప్రదర్శనగా వచ్చిన బాధితులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. - రఘునాథపాలెం



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని గురుకుల బాలుర పాఠశాలలో దెబ్బలను చూపిస్తున్న విద్యార్థి నిఖిల్

## గురుకుల పాఠశాలలో ర్యాగింగ్ కలకలం

### పాఠశాల విద్యార్థులపై ఇంటర్ విద్యార్థుల దాడి

బెల్లంపల్లి, మార్చి 3 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఎనిమిదో తరగతి విద్యార్థి చక్రధర్‌ను ఇంటర్మీడియట్ విద్యార్థులు బాత్రూం వద్దకు తీసుకెళ్లి బట్టలు విప్పించారు. ఈ ఘటనను చూసిన పదోతరగతి విద్యార్థి నిఖిల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో నిఖిల్‌పై ఆదివారం రాత్రి దాడిచేశారు. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్, ర్యాగింగ్ విద్యార్థులను నిలదీశారు.